క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళ వారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారా ధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గం టల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమ లేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మో..పాము



కట్లపామును పట్టుకున్న స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి

డాబాగార్డెన్స్: జీవీ ఎంసీ 29వ వార్డు మ హారాణిపేట దిబ్బల పాలెంలో పాములు సంచరిస్తున్నాయి. ఇటీవల పలు చిన్న పాములు అంబికా బాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయానికి ఆనుకుని ఉన్న ముళ్ల పొదల నుంచి వస్తు న్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇదే తర హాలో మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతం లో ఓ ఇంటి ప్రహరీకి ఆనుకుని కట్లపాము కని పించింది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు అమ్మో పాము.. అంటూ భయాందోళనలకు గురయ్యారు. స్నేక్ సేవర్ సొసైటీ వ్యవస్థాప కుడు రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారమి చ్చారు. దీంతో సొసైటీ ప్రతినిధి వచ్చి పామును పట్టుకున్నారు. ముళ్ల పొదల్లో పలు పాములు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

ఘనంగా నూకాలమ్మ తల్లి పరస



అలంకరణలో నూకాలమ్మ

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవాని పాలెంలో గల శ్రీ నూకాలమ్మ తల్లి పరస మహో త్సవం మంగళ వారం రాత్రి అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కాలనీ పరిసర ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నేలవేషాలు, సాముగరిడీ, భజ నలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల యాన్ని, వీధులను విద్యుత్ దీపాలతో సర్వాం గ సుందరంగా అలంకరించారు. రాత్రి బుర్రకథ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రెసిడెంట్ గుడ్ల కాటరాజు రెడ్డి, కార్యదర్శి కారపు రెడ్డి శ్యామ్‌రెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తి రెడ్డి, కార్యవర్గ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఆలోచించు.. ఆచరించు

పనిలో భద్రత ముఖ్యమంటూ సందేశం ఇస్తున్న వర్ణ చిత్రాలు

బ్యూటిఫికేషన్‌లో భాగంగా పోర్టు ప్రహరీపై చిత్రీకరించిన అందమైన బొమ్మలు

చూపరులను ఆలోచింపజేస్తున్న చిత్రకారుని ప్రతిభ

ఐ కేర్ ఫర్ మై ఫ్యామిలీ..

కార్మికుడు పనిలో నిమగ్నమైనప్పుడు ముం దుగా పాటించాల్సింది.. భద్రతా చర్యలు. నా కుటుంబానికి ఏ కష్టం రాకుండా ఉండాలం టే పనిలో నిమగ్నమయ్యేటప్పుడు ముందుగా సేఫ్టీ పరికరాలు ఉపయోగించాలంటూ.. ఐ ఫాలో సేఫ్టీ చిత్రం స్పష్టం చేస్తుంది.



ఐ కేర్ ఫర్ మై ఫ్యామిలీ చిత్రం



సందేశాత్మక చిత్రాలతో సుందరంగా కనిపిస్తున్న పోర్టు ప్రహరీ

డాబాగార్డెన్స్: సందేశాత్మక చిత్రాలతో పోర్టు బ్యూటిఫికేషన్ అందర్నీ ఆకట్టుకుంటోంది. పోర్టు ఉద్యోగులు.. అటుగా వెళ్లే ప్రజలు దీనిని చూసి ముచ్చట పడుతున్నారు. ఒకప్పుడు పోర్టులోకి వెళ్లాలంటే.. అమ్మో దుమ్ము..ధూళి అంటూ భయపడేవారు. బొగ్గు కాలుష్యం ఉన్నప్పటికీ.. పోర్టు ప్రహరీపై వేస్తున్న చిత్రాలు పలువురిని ఆకట్టు కుంటున్నాయి. ఇటు విశాఖ అందాలు.. మరోవైపు పోర్టులో భద్రతా చర్యలు.. ఇం కో వైపు ప్రమాదం సంభవిస్తే తీసుకోవ ల్సిన జాగ్రత్తలు ఇలా ఎన్నో చిత్రాలు సందే శాత్మకంగా చిత్రీకరించారు. ఆ చిత్రాలకు విద్యుత్ లైట్లు జోడించడంతో ఆ అందాలకు మరింత ఆకర్షణ చేకూరినట్టయింది. ఏమిటి భద్రతా ప్రమాణం? భద్రతా చర్యలు ఎందుకు అవసరం? వివిధ రకాల భద్రతా చర్యలు.. భద్రతా చర్యలు ఎం చుకోవడం, ఉపయోగించుకోవడంలో చిట్కాలు.. సాంకేతిక పురోగతి.. ఇలా కంపెనీలో ప్రమాదాలు నిరోధించడానికి.. తగ్గించడానికి ఉద్దేశించిన చర్యలు బొమ్మల రూపంలో చిత్రీకరించారు.

చోరీలు, మంటలు, ప్రమాదాలు, ఇతర సంఘట నల నుంచి కార్మికులు ఎలా బయటపడాలి.. సంస్థ ఆస్తులను ఏ విధంగా రక్షించాలో తెలిపే చిత్రాలు అలరిస్తున్నాయి. అలాగే ప్రమాదాలు.. గాయాలు.. అనారోగ్యాల నుంచి ఉద్యోగులను రక్షించడానికి.. వ్యక్తిగత భద్రతా చర్యల్లో వ్యక్తిగత రక్షణ పరికరాలు.. ఇలా ఎన్నో ఆకట్టుకుంటున్నాయి.

రంగులు.. ఆకారాలు..


రంగులు.. ఆకారాలను సూచిస్తూ తీసుకోవల్సిన జాగ్రత్తలపై రూపొందిం చిన చిత్రం కార్మికులకు ఎంతో ఉపయు క్తమని చెప్పొచ్చు. సర్కిల్.. ట్రయాంగిల్.. స్క్వేర్.. రెక్టాంగిల్.. బ్లూ.. ఎల్లో.. గ్రీన్.. రెడ్ వంటి రంగులతో పాటు చిహ్నాలు పొందుపరిచారు.

విశాఖ అందాలు..

విశాఖ.. అరకు అందాలు.. నగర సంస్కృతి.. ఆలయాలు.. జల, వాయు, రైలు మార్గాలు.. జాతీయ జంతువులు ఇలా ఎన్నో చిత్రాలు మనల్ని అలరిస్తాయి. ఈ చిత్రాలు ఎంతగానో ఆక ట్టుకుంటున్నాయి.

ప్రమాదమా? భద్రతా?

కార్మికుడు విధుల్లో చేరే ముందు ఆలోచించా ల్సింది.. ప్రమాదామా? భద్రతా? అనే దాని గురించి ఆ తర్వాతే విధుల్లో చేరాలి. భద్రతా చర్యల ఎంపిక నీదేనంటూ వేసిన చిత్రం.. ఆ చిత్రం క్యాప్షన్ పలువుర్ని ఆకట్టుకుంటోంది.



ప్రమాదమా? భద్రతా? అని ప్రశ్నిస్తున్న చిత్రం

సేఫ్టీ ఫస్ట్..

విధుల్లో చేరే ముందు పనిముట్లు అవసరం. ఏ పనికి ఏ పనిముట్లు అవసరమో.. అం దుకు తగ్గట్టుగా భద్రతా పరికరాలు కూడా ముఖ్యమే. అందుకు సంబంధించి హెల్మెట్.. గ్లౌజ్స్.. క్యాప్.. బాడీ సేఫ్టీ.. ఇలా భద్రతకు సంబంధించిన వస్తు వులు చిత్రంలో పొందుపరిచారు.



ప్రమాదం జరిగితే..

కంపెనీ/పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవి స్తే.. ముందుగా తీసుకోవల్సిన చర్యలు.. అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపు స్పం దించాల్సిన విధానం.. అగ్నిమాపక సిబ్బంది వచ్చిన తర్వాత తీసుకునే చర్య లపై చక్కని చిత్రాలు రూపొందించారు.



ప్రమాదం జరిగితే ఎలా ఎదుర్కోవాలో తెలిపే చిత్రం

ఎంజీఎం హైస్కూల్‌కు ఐడీబీఐ బ్యాంకు వితరణ



సామగ్రితో బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ ము న్సిపల్ హైస్కూల్‌కి ఐడీబీఐ బ్యాంకు కార్పొరేట్ సామా జిక బాధ్యతగా రూ.1.75 లక్షల విలువ గల మూడు అల్మారాలు, 20 డెస్కులు, వంద మిడ్ డే మీల్ లంచ్ ప్లేట్లు, 10 సీలింగ్ ఫ్యాన్లు అందజేసింది. ఈ మేరకు మంగళవారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమం లో బ్యాంకు విశాఖ ప్రాంతీయ ప్రధాన రీజినల్ జనరల్ మేనేజర్ కాన్వదేబ్ దాస్, హెడ్ ఐడీబీఐ అసిస్టెంట్ జన రల్ మేనేజర్ బి.తులసి, రీజినల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరేష్ క్రిశెట్టి ఇతర సిబ్బంది కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణానికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యార్థులు వీటిని వినియోగించుకుని చక్కగా చదువుకుని ఉన్న త స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిం చారు. ఒక విద్యార్థి పుట్టిన రోజు అని తెలుసుకున్న వారు చాక్లెట్లు తీసుకొచ్చి అతనికి పుట్టిన రోజు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపా ధ్యాయు లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన కమ్యూనికేషన్ నైపుణ్యంపై అవగాహన

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశా లలో మంగళవారం కళాశాల ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్, కెరీర్ గైడెన్స్ సెల్, కళాశాల కామర్స్ విభాగం సంయు క్తంగా మెరుగైన కమ్యూనికేషన్ నైపుణ్యం, దాని వల్ల కలిగే లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ట్రైనర్ సునీత పాథక్ కమ్యూనికేషన్ అభివృద్ధి వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐసీఎఫ్ఏఐ డిప్యూటీ మేనేజర్ ఎం. అభిషేక్, ఎస్. వెంకటేష్, కె. శ్యామ్, పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బం ది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆహ్వాన్ ఫెస్ట్



మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్: నిత్యం పాఠ్యాంశాల బోధన, పోటీ పరీక్షలకు కసరత్తు చేసే విద్యాసంస్థలో కళలు, క్రీడలతో సందడి వాతావరణం నెలకొంది. బిగ్‌బాస్ ఫేమ్, యాక్టర్ అర్జున్ కల్యాణ్ సందడితో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. ఇక్కడ మంగళ వారం నిర్వహించిన 'ఆహ్వాన్ ఫెస్ట్'లో పాల్గొన్న వన్ టౌన్ సీఐ జీడీ బాబు మీ కోసం మీ పోలీస్ కార్య క్రమం ద్వారా ఎన్నో మంచి విషయాలను విద్యార్థు లకు బోధించారు. కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఏవీఎన్ కళాశాల ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితం కాకుండా, ఇంతర ప్రాంతాలకు చెందిన వారికి విద్య అందిస్తుందని, కళాశాలకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినా యుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొని ప్రతిభ చూపాలని అభిలషించారు. కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ కుమారి, డీన్ శంకర్ నారాయణ, పాలిటెక్నిక్ కళా శాల ప్రిన్సిపాల్ మురళి, కళాశాల ఇంగ్లీషు విభాగా ధిపతి పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం కుయుక్తులు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ జగదాంబ జోన్ కార్యకర్తలు

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాల ధాటిని తట్టుకో లేక మోదీ ప్రభుత్వం దొడ్డి దారిన ప్రైవేటీకరణ అజెం డాను అమలు చేసే ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ నాయకుడు సంతోష్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షలో సీఐ టీయూ జగదాంబ జోన్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా మొదట ప్లాంట్ నష్టాల్లో ఉందని, ఆ తర్వాత ప్లాంట్ అమ్మకానికి నష్టాలతో నిమిత్తం లేదని నిస్సిగ్గుగా మోదీ ప్రభుత్వం ప్రకటిం చడం దారుణమన్నారు. ప్లాంట్ మనుగడకి కావలసిన ముడి సరుకు ఆపేయడం, కార్మికులకు నాలుగు నెల లుగా జీతాలు చెల్లించకపోవడం, వీఆర్ఎస్ ప్రకటిం చడం వంటి కుయుక్తులతో కార్మికులను భయాందోళ నలకు గురి చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇటువం టి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ సీనియర్ నాయకులు వై. రాజు, ప్రొఫెసర్ సూరప్పుడు, సంజయ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



పూజలు చేస్తున్న బాపూ ఆనంద్

డాబాగార్డెన్స్: రజకుల వేడుక బల్లల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 31వ వార్డు పరిధి కనకలవీధి, గంగులగెడ్డలో నిర్వహిం చిన పండగలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ పాల్గొని ప్రత్యేక పూజలు జరి పారు. అనంతరం ఆయనను వివిధ రజక సం ఘాలు సత్కరించాయి. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, కనకరాజు, రామూ మాస్టారు, పెంటకోట నాగరాజు, గంటా శ్రీనివాస్, బాబూరావు, శేఖర్, హేమంత్, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ఆరోగ్యంపై తల్లిదండ్రుల ఆందోళన



వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాలుడు

మహారాణిపేట: చింతపల్లి మం డలం చౌడుపల్లి పంచాయతీ చౌట పాడు గ్రామానికి చెందిన బూర్జ గణ పతి, జేమ్స్‌కు మూడో సంతానం గా మగపిల్లాడు జన్మించాడు. 18 నెలల ఆ బాలుడు వృషణాల వాపుతో బాధ పడుతుం డడంతో శుక్ర వారం కేజీహెచ్ పిల్లల వార్డులో చేర్పించారు. శనివారం బాలుడికి శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలో గుండె నొప్పి రావడంతో బాలుడు కోమాలోకి వెళ్లిపోయాడని వైద్యులు తెలి పారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగు తోంది. ఇంకా బాలుడి హార్ట్ బీట్ నమోదవుతుం దని వైద్యులు చెబుతున్నారు. బాలుడి చికిత్సపై తమకు అనుమానాలు ఉన్నాయని, అప్పటి వరకు ఎంతో ఆరోగ్యంగా ఆడుకున్న బాలుడు ఎలా కోమాలోకి వెళ్లిపోతాడని తల్లిదండ్రులు ప్రశ్నిస్తు న్నారు. వైద్యులు మాత్రం బాలుడి వృషణం మెలిక పడి రక్త ప్రసరణ ఆగిపోయిందని చెబుతు న్నారు. శస్త్ర చికిత్స చేసి రక్త ప్రసరణను సరి చేయ డానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు.

రెండు రోజుల పాటు సీపీఐ కార్యవర్గ సమావేశాలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 30,31 తేదీల్లో విశాఖలో జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన, వివిధ రంగాల పరిస్థితిపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన చేయ నున్నట్లు వివరించారు. సీపీఐ శత జయంతి ఉత్స వాల నేపథ్యంలో 29వ తేదీ సాయంత్రం 5 గంట లకు పౌరగ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర – భవిష్యత్తు సవాళ్లు' అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరుగుతుందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విజయసాయిరెడ్డి చేసిన అక్రమాల కారణంగా విశాఖ బ్రాండ్ ఇమేజ్ మసకబారిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి విజయసాయిరెడ్డి అక్రమాలపై సుప్రీం కోర్టుకు లేఖ రూపంలో ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా ఎందుకు విచారణకు ఆదేశాలు ఇవ్వలేకపోతు న్నారని నిలదీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు విజయసాయిరెడ్డిపై చేసిన ఆరోపణలపై ఇప్పటికీ తగిన చర్యలు ఎం దుకు తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్‌కే రెహమాన్, ఎం.మన్మ థరావు, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్ తదిత రులు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం సేవలు నిరుపమానం



మాట్లాడుతున్న ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

డాబాగార్డెన్స్: మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్రం చైర్మన్ పీఎస్ పద్మనాభరాజు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేం ద్రం సేవా దృక్పథంతో ప్రారంభమైందని, దీనిలో భాగంగానే ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహి స్తున్నామని తెలిపారు. సీనియర్ వైద్యుడు డాక్టర్ సి. శ్రీనివాసరావు ప్రతిరోజూ సాయంత్రం 5.30 నుంచి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారని తెలి పారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సాయి, డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రారంభ దశలో గుర్తిస్తే వైద్యం చేయడం సాధ్యమవుతుందని, రోగి పూర్తిగా రిలీఫ్ పొంద వచ్చని తెలిపారు. క్యాన్సర్ ఉందా? లేదా? తెలు సుకునే నిర్ధారణ పరీక్షలు బాగా ఖర్చుతో కూడుకు న్నవని, మెడికవర్ ఆస్పత్రి ఉచితంగా క్యాంపులు నిర్వహించి ఈ సదుపాయం ఉచితంగా అందిస్తుం దని తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ప్రతి రూ.100కు రూ.67 వైద్యానికి సొంత డబ్బు పెట్టుకోవల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. రాజు మాట్లా డుతూ ప్రజారోగ్యాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకుని, ప్రజలకు ఉచితంగా సేవలందించాల న్నారు. కానీ ఆరోగ్య పరికరాలపైన పన్నులు విధించడం అన్యాయమని, ప్రభుత్వం చేపట్టలేని పనులు అల్లూరి విజ్ఞాన కేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చంద్ర మౌళి, శేషుకుమార్, కంటి పరీక్షల టెక్నీషియన్ రాజు, మెడికవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి కిరణ్ తదిత రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రతాప్ సూచించారు. గురుద్వార జంక్షన్‌లో హెల్మెట్ లేకుండా రాకపోకలు సాగిస్తున్న వారికి మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనచోదకులు తప్ప నిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయరాదని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైన ర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచిం చారు. కారు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ముందు సీటులో కూర్చునేవారు విధిగా సీటు బెల్టు పెట్టుకో వాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో ఫోన్లలో మాట్లాడరాదని స్పష్టం చేశారు. రోడ్డు దాటే పాదచారులు ఫోన్లలో మాట్లాడడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. రెడ్‌సిగ్నల్ జంపిం గ్ చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని కోరారు. మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలైతే జీవి తాలు నాశనమవుతాయని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై వీవోఏల నిరసన



ధర్నా చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: తమ సమస్యల పరిష్కారంలో తీవ్ర అలసత్వం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిర సిస్తూ వీవోఏలు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రెండో రోజు నిరాహార దీక్షలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు నిర్వహించాలని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సం ఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రూపాదేవి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పిస్తామ ని, 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 4వ తేదీన సెర్ప్ సీఈవో సమక్షంలో చర్చలకు ఆహ్వానించారని అన్నారు. అలాగే ప్రభుత్వం రెండు నెలల వేతనాలు వేస్తామని తెలిపిందన్నారు. బుధవారం జరగాల్సిన నిరాహారదీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. పని భారం పెంచారని,మహిళా మార్టలలో బలవంతపు కొనుగోళ్ల వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. గ్రూప్ సభ్యులు అభయ హస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. ప్రజలు, వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఆనందపురం నుండి పి. అపర్ణ, ఎం. శ్యామల, పద్మ కుమారి, లావణ్య, పెందుర్తి నుండి వి. శ్రీలక్ష్మి, ఎ. శారద, జి. రమణి, బి. దేవి, పి. కృష్ణవేణి,, పద్మ నాభం నుండి పి. కంచమ్మ, పి. సంతోషి, వరలక్ష్మి, కె. అప్పలకొండ, భీమిలి నుండి యు.పార్వతి, పి. వెంకటలక్ష్మి, కె. వెంకటలక్ష్మి, పార్వతి, హైమా నిహా హారదీక్షల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి యూని యన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్ష, కార్యదర్శులు అపర్ణ, కంచమ్మ , కోశాధికారి శ్రీలక్ష్మి, యూనియన్ ముఖ్య నాయకులు వెంకటలక్ష్మి, పార్వ తి, శారద తదితరులు పాల్గొన్నారు.

• పొంచి ఉన్న ప్రమాదం

బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ సమీపంలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. అంతే కాదు.. అక్కడి రోడ్డు కూడా శిథిలమై గోతులతో నిండి ఉంది. ఆ పక్కనే ఫుట్‌పాత్‌పై మ్యాన్ హోల్ తెరచుకుని ప్రమాదకరంగా కనిపిస్తోంది. రాత్రివేళల్లో ఈ మ్యాన్‌హోల్‌లో పాదచారులు ఎవరైనా పడే ప్రమాదం ఉంది. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





• ఇక్కడింతే..

కేజీహెచ్ క్యాజువాలిటీలో కొత్తగా నిర్మించిన అవుట్ పేషెంట్ (ఓపీ) దగ్గర ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె తిరగబడింది. గత కొద్ది రోజులుగా ఇదిలాగే ఉంది. అం దరూ దీన్ని చూస్తున్నారు గాని ఎవరూ స్పందించడం లేదు. ఆ బాక్సులో ఫిర్యాదు వేస్తే సూపరింటెండెంట్‌కు చేరుతుందా అని చూసిన వారు అనుకుంటున్నారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

• అబ్బా.. అభ..

కేజీహెచ్ ఓపీలో అభ ఆన్‌లైన్ ఓపీ టిక్కెట్ల కౌంటర్ వద్ద జనం బారులు తీరుతున్నారు. ఈ యాప్ సక్రమంగా పని చేయకపోవడం, రోగులు, వారి బంధువులకు దీనిపై పూర్తిగా అవగాహన లేకపోవడం, ఇతర కారణాల వల్ల ఓపీ టిక్కెట్ల కోసం వచ్చే వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

